సంపుటి :03 | సంచిక :59 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

శనివారం 18, ఏప్రిల్ 2026

## ఏసీబీ వలలో అవినీతి చేప

- రూ.2 లక్షల లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఎక్సైజ్ సీఐ
- అద్దె ఇంట్లోనే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

02





# నో హెల్మెట్.. నో పెట్రోల్

- కఠినంగా అమలు చేయాలన్న జిల్లా కలెక్టర్ డా సత్య శారద
- పెట్రోల్ బంక్ యజమానులతో సమీక్ష సమావేశం

ప్రజాపాలన–ప్రగతి కార్యాచరణలో భాగంగా జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పెట్రోల్ బంక్ యజమానులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేయడానికి "నో హెల్మెట్... నో పెట్రోల్" అనే విధానాన్ని కఠినంగా అమలు చేయాలని పెట్రోల్ బంక్ యజమాన్యాన్ని ఆదేశించారు. పెట్రోల్ బంకులకు వచ్చే వాహనదారులకు హెల్మెట్ అవసరంపై అవగాహన కల్పించాలని, నియమాలు పాటించే వారిని ప్రోత్సహించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని, ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంచడంలో పెట్రోల్ బంక్ యజమానులు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ పేర్కొన్నారు. శనివారంతో అరైవ్ అలైవ్ కార్యక్రమం చివరి రోజున పెట్రోల్ బంకుకి హెల్మెట్ ధరించి సీట్ బెల్ట్ ధరించి వచ్చే వారికి గులాబీ పువ్వును బహుకరించి సురక్షితమైన ప్రయాణం చేయాలని సూచించాలని వాహనదారులకు అవేర్నెస్ కల్పించే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై వి గణేష్, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిష్టయ్య, పెట్రోల్ బంక్ యజమానులు పాల్గొన్నారు.

– అక్షరదర్బార్, వరంగల్



# కేంద్రానికి షాక్

## లోక్ సభలో వీగిపోయిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు

### దక్కని మెజారిటీ.. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ కు బ్రేక్

- విపక్షాలు మహిళా హక్కులను అడ్డుకుంటున్నాయన్న అమిత్ షా
- ఇది దేశ సమాఖ్య స్ఫూర్తికి లభించిన విజయమన్న రాహుల్
- పన్నెండేళ్లలో రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవటం ఇదే తొలిసారి

02

దేశ రాజకీయాల్లో పెను సంచలనం నమోదైంది. కేంద్రం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026 శుక్రవారం లోక్ సభలో వీగిపోయింది. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) కోసం ప్రతిపాదించిన ఈ బిల్లుకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించలేదు. గత 12 ఏళ్ల మోదీ పాలనలో రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ఇదే తొలిసారి. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందన్న విపక్షాల ఆందోళనల మధ్య జరిగిన ఓటింగ్ లో ప్రభుత్వం లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. దీంతో డీలిమిటేషన్ సహా అనుబంధ బిల్లులను కేంద్రం వెనక్కి తీసుకుంది.

– అక్షరదర్బార్, న్యూఢిల్లీ



## ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- నస్తురుపల్లిలో 'రైతు భరోసా' గర్జన
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రైతు భరోసా నిధుల విడుదల
- 20న మేడిగడ్డ సందర్శన.. అనంతరం భారీ బహిరంగ సభ
- సభ స్థలిని పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు
- సభ స్థలిని పరిశీలించిన మంత్రి

02

# ఏసీబీ వలలో అవినీతి చేప

- రూ.2 లక్షల లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఎక్సైజ్ సీఐ
- అద్దె ఇంట్లోనే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



అక్షరదర్బార్, బిచ్కుంద: అవినీతి తిమింగలాలపై యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) మరోసారి పంజా విసిరింది. విధి నిర్వహణలో నిజాయితీని గాలికొదిలేసి, అధికారిక అనుకూలం కోసం భారీగా లంచం డిమాండ్ చేసిన కామారెడ్డి జిల్లా బిచ్కుంద ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ దీను సత్యనారాయణ శుక్రవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. రూ.2 లక్షల నగదు తీసుకుంటుండగా అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. బిచ్కుంద మండలంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరుగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ, ఒక ఫిర్యాదుదారునికి చెందిన తాటి కల్లు దుకాణాల విషయంలో అనుకూలంగా వ్యవహరించేందుకు ఈ భారీ మొత్తాన్ని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఉన్న కల్లు దుకాణాలను మార్చాలని ఒత్తిడి చేయకుండా ఉండేందుకు, బాధితుడిపై మరిన్ని తప్పుడు కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు ప్రతిఫలంగా రూ.2 లక్షలు డిమాండ్ చేశారు.

### అద్దె ఇంట్లోనే పక్కా ప్లాన్‌తో దాడి

బిచ్కుందలోని తన అద్దె నివాసంలో బాధితుడి నుంచి లంచం సొమ్మును స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేశారు. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన అధికారి బ్యాగును తనిఖీ చేయగా, అందులో లెక్కలు చూపని అదనపు నగదు రూ.45,760 కూడా లభ్యమైంది. దీన్ని కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక విధులను దుర్వినియోగం చేస్తూ అవినీతికి పాల్పడినందుకు సత్యనారాయణను అరెస్ట్ చేసినట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి. నిందితుడిని హైదరాబాద్ నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు. ఈ కేసులో ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.



# క్రీడలు మానసిక ఉల్లాసానికి నిలయాలు

- క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్సీ పోచంపల్లి

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం కౌకొండ గ్రామంలో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌పీఎల్ (నడికూడ ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.30,000, రెండవ బహుమతిగా రూ.20,000తో పాటు మెడల్స్‌ను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి టోర్నమెంట్లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. యువత క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి జట్టుకు క్రికెట్ సామగ్రి అందజేస్తామని తెలిపారు.గ్రామాభివృద్ధికి తన ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.20 లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే పోచంపల్లి ఫౌండేషన్ ద్వారా గ్రామీణ మహిళలకు ఇప్పటికే కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు, ఆత్మకూర్, దామెర మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరకాల, నడికూడ మండలాల్లో మరిన్ని గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు పేర్కొన్నారు.భవిష్యత్తులో నిరుద్యోగ యువత కోసం కౌకొండ గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. తన స్వగ్రామం వరికోల్, నడికూడ మండల అభివృద్ధికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ కే. వాసుదేవ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ వై. సతీష్ రెడ్డి, కౌకొండ సర్పంచ్ ఓదెల శ్రీలత-భాస్కర్, పోచంపల్లి ఫౌండేషన్ కన్వీనర్ చందా కుమార్ స్వామి, బీఆర్ఎస్ నాయకులు మేడిపల్లి శోభన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రానికి షాక్

- లోక్ సభలో వీగిపోయిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు
- దక్కని మెజారిటీ.. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ కు బ్రేక్
- పన్నెండేళ్లలో రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవటం ఇదే తొలిసారి
- విపక్షాలు మహిళా హక్కులను అడ్డుకుంటున్నాయన్న అమిత్ షా
- ఇది దేశ సమాఖ్య స్ఫూర్తికి లభించిన విజయమన్న రాహుల్



అక్షరదర్బార్, న్యూఢిల్లీ : పార్లమెంటులో శుక్రవారం జరిగిన కీలక పరిణామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026 లోక్‌సభలో వీగిపోయింది. మహిళా రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వంటి కీలక అంశాలతో ముడిపడి ఉన్న ఈ బిల్లుకు సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించలేదు. సుదీర్ఘ చర్చ అనంతరం స్పీకర్ ఓం బిర్లా డివిజన్ ఓటింగ్‌కు అనుమతించారు. బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, బిల్లుకు వ్యతిరేకంగా 230 ఓట్లు నమోదయ్యాయి. రాజ్యాంగ సవరణ కావడంతో 2/3 వంతు సభ్యుల మద్దతు (సుమారు 352-360 ఓట్లు) అవసరముండగా, ప్రభుత్వం ఆ మార్కును అందుకోలేకపోయింది.

### సీట్ల పెరుగుదల

ఈ బిల్లు ద్వారా లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతమున్న 543 నుండి 850కి పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. 2029 నుండి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేలా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను 2011 జనాభా లెక్కల ఆధారంగా చేపట్టాలని కేంద్రం భావించింది. కేవలం మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందని ఇండియా కూటమి ఆరోపించింది. రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంతో, దీనికి అనుబంధంగా ఉన్న 'డీలిమిటేషన్ బిల్లు-2026', 'కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు-2026'లను వెనక్కి తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు.

### రాజకీయ ప్రాధాన్యత

గడిచిన 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడం ఇదే మొదటిసారి. ఓటింగ్ ముగిసిన అనంతరం సభ శనివారానికి వాయిదా పడింది. ఈ పరిణామంపై హోం మంత్రి అమిత్ షా స్పందిస్తూ, విపక్షాలు మహిళా హక్కులను అడ్డుకుంటున్నాయని విమర్శించగా, ఇది దేశ సమాఖ్య స్ఫూర్తికి లభించిన విజయమని రాహుల్ గాంధీ అభివర్ణించారు.

# ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- నస్తురుపల్లిలో 'రైతు భరోసా' గర్జన
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రైతు భరోసా నిధుల విడుదల
- 20న మేడిగడ్డ సందర్శన.. అనంతరం భారీ బహిరంగ సభ
- సభ స్థలిని పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు
- సభ స్థలిని పరిశీలించిన మంత్రి



అక్షరదర్బార్, కాటారం: ఈ నెల 20న భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బ్యారేజ్ సందర్శన, కాటారం మండలం నస్తురుపల్లి గ్రామంలో రైతులకు సంబంధించి రైతు భరోసా పథకానికి సంబంధించిన నిధులను విడుదల చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు శాసనసభ్యులందరు పాల్గొననున్నారని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం రాత్రి కాటారం మండలం నస్తూరిపల్లి గ్రామంలో 20న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేయనున్న బహిరంగ సభ స్థలాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్, భూపాలపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో కలిసి పరిశీలించారు. రైతులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరు కావాలని సూచించారు. రైతులకు ఇబ్బంది జరగకూడదని చెప్పిన మాటను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి మన ప్రాంతానికి రావడం, మన ప్రాంత రైతుల సమక్షంలో రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నారని తెలిపారు. రైతులు, మహిళలు అధిక సంఖ్యలో వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా

స్టేజీ కెపాసిటీ మ్యాపు పరిశీలించి, ర్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. మైదానాన్ని రోలింగ్ చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పార్కింగ్, హెలిప్యాడ్ మ్యాపు పరిశీలించారు. వచ్చే ప్రజలకు మంచినీరు, మజ్జిగ సమృద్ధిగా అందచేయాలని సూచించారు.

# భర్త హత్యకు రూ.5 లక్షల సుపారీ

- హత్య చేసి వీడియో తీసిన కిరాయి హంతకులు
- ప్రియుడు తమ్ముడితో కలిసి భర్తను అంతం చేసిన ఇల్లాలు
- భర్తను చంపాక తగులబెట్టి.. బొక్కలను వాగులో పారేసిన భార్య
- వివాహేతర సంబంధంతో భర్తహత్యకు భార్య స్కెచ్
- మిస్సింగ్ కేసులో విస్తుపోయే నిజాలు
- భార్య సహా ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు




అక్షరదర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో ఇటీవల అదృశ్యమైన మడికొండ సుమన్ భరత్ (38) ఉదంతం విషాదాంతమైంది. తన భర్తను అడ్డుతొలగించుకోవాలని భార్య, తన ప్రియుడు, తమ్ముడితో కలిసి కిరాయి హంతకులతో చేయించిన పక్కా ప్లాన్ హత్యగా పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ మీడియాకు వివరాలను వెల్లడించారు. మీడియా సమావేశంలో పరకాల ఏసీపీ సతీష్ బాబు, సీఐ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

**వివాహేతర సంబంధమే కారణం**

పోలీసుల కథనం ప్రకారం.. పరకాలకు చెందిన సుమన్ భరత్‌కు 2012లో లావణ్యతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, లావణ్యకు అదే పట్టణానికి చెందిన ఇమ్మడి నరేష్‌తో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయంలో సుమన్ భరత్ తరచూ భార్యను వేధించేవాడు. దీంతో భర్తను వదిలించుకోవాలని నిర్ణయించుకున్న లావణ్య, తన తమ్ముడు పెండల రాజు, ప్రియుడు నరేష్‌తో కలిసి కుట్ర పన్నింది.

**5 లక్షల సుపారీ.. మద్యం తాగించి హత్య**

ములుగు జిల్లా గోవిందరావుపేటకు చెందిన చిరంశెట్టి వెంకటేశ్వర్లుకు సుమన్ భరత్‌ను చంపేందుకు రూ. 5 లక్షల సుపారీ ఇచ్చారు. ఇందుకోసం లావణ్య తన బంగారాన్ని తాకట్టు పెట్టి డబ్బులు సమకూర్చింది. పథకం ప్రకారం ఈనెల 3వ తేదీన సుమన్ భరత్‌ను మద్యం ఆశచూపి ములుగుకు పిలిపించారు. అక్కడ వెంకటేశ్వర్లు, భూక్యా రాకేష్ కలిసి మద్యం తాగించి, సుమన్ మత్తులో ఉన్నప్పుడు బీర్ బాటిల్‌తో తలపై కొట్టి చంపేశారు. అనంతరం పెట్రోల్ పోసి మృతదేహాన్ని తగులబెట్టారు. భయానక విషయం ఏంటంటే.. నిందితులు సుమన్‌ను చంపుతున్నప్పుడు, తగులబెడుతున్నప్పుడు వీడియోలు తీసి లావణ్యకు చూపించారు.

**ఆధారాలు లేకుండా చేసే ప్రయత్నం**

హత్య జరిగిన మరుసటి రోజు నిందితుడు వెంకటేశ్వర్లు కాలిపోయిన సుమన్ అస్థికలను (బొక్కలను) ఒక సంచిలో వేసి సమీపంలోని దయ్యాల వాగులో పారేశాడు. అటు లావణ్య ఏమీ తెలియనట్లు పరకాలలోని తన అత్తగారి ఇంటికి చేరుకుంది. ఏప్రిల్ 8న సుమన్ తండ్రి సాంబయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసుగా దర్యాప్తు ప్రారంభించిన పరకాల పోలీసులు, సాంకేతిక ఆధారాల సాయంతో నిందితులను పట్టుకున్నారు.

**నిందితుల అరెస్ట్ - సామాగ్రి స్వాధీనం**

పోలీసులు నిందితులు చూపిన ఘటన స్థలంలో కాలిపోయిన సిగరెట్ పీకలు, బూడిద, అస్థికలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వద్ద నుంచి వివిధ కంపెనీలకు చెందిన 6 మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు.

**అరెస్టయిన నిందితులు**

1. మడికొండ లావణ్య (భార్య)
2. ఇమ్మడి నరేష్ (ప్రియుడు)
3. పెండల రాజు (లావణ్య తమ్ముడు)
4. చిరంశెట్టి వెంకటేశ్వర్లు (కిరాయి హంతకుడు)
5. భూక్యా రాకేష్ (సహకరించిన వ్యక్తి)

నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## పీఆర్సీ, డీఏల జాప్యంపై ఉద్యోగుల నిరసన

- ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద జేఏసీ ఆందోళన

అక్షరదర్బార్, పరకాల: ప్రభుత్వం అమలు చేయవలసిన పీఆర్సీ, డి.ఏ (డియర్నెస్ అలవెన్స్)ల విడుదలలో జరుగుతున్న జాప్యంపై ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో జేఏసీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ, తాహసిల్దార్ విజయలక్ష్మిలకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. పెండింగ్‌లో ఉన్న డి.ఏలను తక్షణమే విడుదల చేయాలని, పీఆర్సీ అమలు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఆలస్యం కారణంగా తమపై ఆర్థిక భారం పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం సమస్యను గమనించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిరసన కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.



## బస్టాండ్ కూడలిలో చలివేంద్రం

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 9వ వార్డులోని బస్టాండ్ సర్కిల్లో శుక్రవారం స్థానిక కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు చాలా ఉపయోగపడతాయని, ఈ అవకాశాన్ని అందరు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, కౌన్సిలర్లు బండి శ్రీధర్, కొయ్యడ శ్రీనివాస్, కుక్కల విజయ్ కుమార్, ఆకుల లావణ్య శ్రీధర్, సుధమల రమేష్, మున్సిపాలిటీ సిబ్బంది వెంకట్ రెడ్డి, జవన్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.






## 'గోల్డెన్ అవర్'లో అందించే సాయమే ప్రాణదానం: సీఐ మల్లేష్

- చిట్యాల ఆసుపత్రిలో పోలీసులకు, డ్రైవర్లకు రెస్పాన్స్ ట్రైనింగ్
- 'అరైవ్ అలైవ్'లో భాగంగా ప్రాథమిక చికిత్సపై అవగాహన

అక్షర దర్బార్, చిట్యాల: రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంట సమయం (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఆ సమయంలో బాధితులకు అందించే తక్షణ సహాయమే వారి ప్రాణాలను కాపాడుతుందని చిట్యాల సీఐ డి. మల్లేష్ అన్నారు. తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' ఐదో రోజు కార్యక్రమంలో భాగంగా చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో 'గోల్డెన్ అవర్ రెస్పాన్స్ ట్రైనింగ్' ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మల్లేష్ మాట్లాడుతూ.. ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు పోలీస్ సిబ్బంది, అంబులెన్స్ డ్రైవర్లు, స్థానిక ప్రజలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రమాద స్థలంలో బాధితులను సురక్షితంగా బయటకు తీసే పద్ధతులు, ప్రాథమిక చికిత్స అందించే విధానంపై శిక్షణ ఇచ్చారు. అత్యవసర సమయంలో 100 లేదా 112 కాల్స్ అందిన వెంటనే వేగంగా స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య బృందం, ఎస్సై-3 ఈశ్వరయ్య, పోలీస్ మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సంకీర్తనలతో హిందూ సమ్మేళనానికి ఆహ్వానం

- ధర్మ సమ్మేళనానికి ఇంటింటి ప్రచారం

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలో హిందూ సమ్మేళనం జాగరణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన ప్రచార కార్యక్రమం భక్తి వాతావరణంలో కొనసాగింది. కార్యక్రమం శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సంకీర్తనలతో ప్రారంభమై వికాస్ నగర్, రాజుపేట, అంబేద్కర్ కూడలి మార్గంగా కుంకుమేశ్వర స్వామి ఆలయం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కొలుగూరి రాజేశ్వర్ రావు, ఉపాధ్యక్షుడు మాడుగుల పాపిరెడ్డి,కోశాధికారి సి ఏ యుగేంద్రచారి, భక్తమండలి సభ్యులు నరేందర్, సతీష్, పాపన్న, ఎర్ర లక్ష్మణ్ తో పాటు హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏప్రిల్ 28, 2026న నిర్వహించనున్న "హిందూ ధర్మ సమ్మేళనం" కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. భజనలతో పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.



## ఇన్‌స్పైర్ కాలేజీ విద్యార్థినికి ఘన సన్మానం

- బైపీసీ విభాగంలో ప్రతిభ కనబరిచిన నేహకు గ్రామంలో అభినందనలు

అక్షరదర్బార్, పరకాల: శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన పోతుగాల నేహ తాజాగా విడుదలైన టీఎస్ ఇంటర్ ఫలితాల్లో బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను 424 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా ఇన్‌స్పైర్ కాలేజీ యాజమాన్యం విద్యార్థినిని ఘనంగా సన్మానించింది. నేహ స్వగ్రామమైన కొప్పులలో నిర్వహించిన కార్యక్రమంలో కాలేజీ యాజమాన్య ప్రతినిధులు తేగల భరత్, లాడె శివ పాల్గొని ఆమెకు శాలువా కప్పి అభినందించారు. కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కుటుంబ సభ్యులు నేహను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## పాడి గేదెల పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

- ఎస్సీ యాక్షన్ ప్లాన్ ద్వారా లబ్ధి.. ఈ నెల 23 చివరి తేదీ
- జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇందిర వెల్లడి

అక్షర దర్బార్, చిట్యాల: ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి అమలు చేస్తున్న ఎస్సీ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 'పాడి గేదెల పథకం' కోసం షెడ్యూల్డ్ కులాల (SC) అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం కార్యనిర్వాహక సంచాలకులు (ED) శ్రీమతి ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 16 నుండి 23వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ అప్లికేషన్ ఫారంతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పట్టాదారు పాసుబుక్కు జిరాక్స్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు జత చేయాలని తెలిపారు. వికలాంగులైతే సదరం సర్టిఫికేట్ తప్పనిసరి అని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## జూకల్‌లో 'పోషణ పక్వాడ' ర్యాలీ

- ప్రతిజ్ఞ చేసిన గ్రామస్తులు
- రక్తహీనత నివారణకు పోషకాహారమే మందు: సూపర్‌వైజర్ జయప్రద

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలం జూకల్ గ్రామంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో శుక్రవారం 'పోషణ పక్వాడ' ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎలగొండ సంధ్యారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జయప్రద మాట్లాడుతూ.. కిశోర బాలికలు, గర్భిణులు మరియు పిల్లలలో రక్తహీనత, తక్కువ బరువు (లో బర్త్ వెయిట్) సమస్యలను తగ్గించేందుకు చిరుధాన్యాలతో కూడిన బలమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ సంధ్యారాణి మాట్లాడుతూ.. ఎండ తీవ్రత దృష్ట్యా పిల్లలు, బాలింతలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. అనంతరం గ్రామస్తుల చేత పోషణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ తిరుపతి, ఏఎన్ఎం సంధ్య, అంగన్‌వాడీ టీచర్లు కరుణాదేవి, విజయలక్ష్మి, అరుణ, సరిత, మమత మరియు మహిళలు పాల్గొన్నారు.



## తహశీల్దార్ వసంతరావుకు ఘన సన్మానం

- మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్, అంబేద్కర్ సంఘం నేతలు

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలానికి నూతనంగా విచ్చేసిన తహశీల్దార్ వసంతరావును శుక్రవారం పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్యలు తహశీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుల్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# మద్యం దుకాణాల 'ఇష్టారాజ్యం'

- ట్రాఫిక్‌తో ప్రజల నరకయాతన!
- పార్కింగ్ స్థలం లేక రోడ్లపైనే వాహనాలు.. స్తంభిస్తున్న రాకపోకలు
- నోటీసులిచ్చినా బేఖాతర్.. వైన్ షాపుల ముందు పంచాయతీ పాలకవర్గం నిరసన
- బెల్ట్ షాపులకు అక్రమ సరఫరా
- సిండికేట్‌గా మారి అధిక ధరలకు విక్రయాలు



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని మద్యం దుకాణాల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. లాభార్జనే ధ్యేయంగా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్న వైన్ షాపుల తీరుపై స్థానిక గ్రామపంచాయతీ పాలకవర్గం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది.

**ట్రాఫిక్ తిప్పలు - పార్కింగ్ కరువు**

మండల కేంద్రంలో ఉన్న రెండు మద్యం దుకాణాలకు సొంత పార్కింగ్ స్థలం లేకపోవడంతో మందుబాబులు తమ వాహనాలను ప్రధాన రహదారిపైనే ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. దీనివల్ల నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రయాణికులు, మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది.

**పారిశుధ్యం పడకే.. దుర్వాసనతో నరకం**

మద్యం దుకాణాల వద్ద కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడం మరో ప్రధాన సమస్యగా మారింది. మద్యం ప్రియులు రోడ్లకు ఇరువైపులా మలమూత్ర విసర్జన చేస్తుండటంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. ఈ పరిసరాల్లో నివసించే ప్రజలు, నడిచే బాటసారులు నరకయాతన అనుభవిస్తున్నారు.

**యజమానుల నిర్లక్ష్యం - సర్పంచ్ సీరియస్**

ఈ సమస్యలపై గ్రామపంచాయతీ పాలకవర్గం ఇప్పటికే రెండుసార్లు నోటీసులు జారీ చేసినా యజమానుల్లో చలనం కలగలేదు. దీంతో శుక్రవారం స్థానిక సర్పంచ్ చాట్ల విజయ, ఉప సర్పంచ్ ఎర్రబెల్లి హిమబిందు, వార్డు సభ్యులు మరియు పంచాయతీ సెక్రెటరీ కలిసి మద్యం షాపుల ముందు నిరసన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం పార్కింగ్, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని హెచ్చరించారు.

**అక్రమ దందా.. అధిక ధరలు:**

యజమానులు సిండికేట్‌గా మారి గ్రామాల్లోని బెల్ట్ షాపులకు అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్నారని, అధిక ధరలకు విక్రయిస్తూ సామాన్యులను దోచుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె వెల్లడించారు.

# హైదరాబాద్ 'మహాధర్నా'ను విజయవంతం చేయాలి

- మోదీ హటావో - కిసాన్ బచావో నినాదంతో కదలాలి
- నర్సంపేటలో యూత్ కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం



అక్షర దర్బార్, నర్సంపేట: దేశ ప్రయోజనాలను పక్కనబెట్టి రైతుల పొట్టగొడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా యూత్ కాంగ్రెస్ చేపట్టే 'మహాధర్నా'ను విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి పరమేష్, నియోజకవర్గ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం నర్సంపేటలో యూత్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏప్రిల్ 18న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి నేతృత్వంలో జరిగే ధర్నాకు నర్సంపేట నుండి భారీగా తరలిరావాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టే ఇండో-యూఎస్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా పార్లమెంట్‌లో చట్టం చేయాలని, లేనిపక్షంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ మోడెం ఎల్లగౌడ్, మండల అధ్యక్షులు బొంత రంజిత్, పురుషోత్తం సురేష్, ఉపాధ్యక్షులు ములుకల మనీష్, మహమ్మద్ సల్మాన్, నాయకులు వనపర్తి శోభన్ కుమార్, లక్క విజేందర్, తడుగుల ప్రవీణ్, ప్రశాంత్, ఈశ్వర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు సకాలంలో నాణ్యమైన బియ్యం అందాలి

- రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసిన సివిల్ సప్లై అధికారి ఫైసల్ హుస్సేన్



అక్షర దర్బార్, ములుగు: రేషన్ లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే సరుకులు సకాలంలో అందేలా డీలర్లు చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సేన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మల్లంపల్లి మరియు ములుగు మండలాల్లోని మహమ్మద్ గౌస్ పల్లి, మల్లంపల్లి, రామచంద్రాపూర్, కోడిశాలకుంట, దేవనగర్, ములుగు, ఇంచర్ల గ్రామాల్లోని రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీలర్లు నిర్ణీత సమయానికి షాపులు తీస్తున్నారా, బయోమెట్రిక్ సక్రమంగా తీసుకుంటున్నారా మరియు బియ్యం నాణ్యతను పరిశీలించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో డిటిసిఎస్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.